

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

### చీర్స్

**మిత్రులంతా** కలిసి న్యూ ఇయర్‌కి ముందు పార్టీ చేసుకుంటున్నారు. బ్యాంకులో పనిచేసే రామనాథానికి డిసెంబర్ 31న పార్టీకి బయలుదేరబోతుండగా గుర్తొచ్చింది - అంతా తలోబాటిలూ తీసుకురావాలని ముందే అనుకున్నారని.

తను ఉత్తి చేతులతో వెళితే బావుండదు. బాటిల్ కొందామంటే వైన్ షాపులన్నీ మూసేసి ఉన్నాయి. రాత్రి పదిన్నర దాటడంతో ఇయర్ ఎండింగ్ కారణంగా బ్యాంకు పని లేట్‌గా పూర్తయింది రామనాథానికి. పని ఒత్తిడిలో బాటిల్ సంగతి మర్చిపోయాడు. పోలీసులు రాత్రి గొడవకాకూడదని వైన్ షాపులన్నింటిని టైముకి దగ్గరుండి మూయించేసారు.

రామనాథానికి పక్కింటి వాళ్ళ తాళం చెవి గుర్తొచ్చింది. వాళ్ళు ఊరికి వెళుతూ తాళంచెవిని రామనాథానికి ఇచ్చి వెళ్ళారు. కరెంటు మీటర్ రీడింగ్ వాళ్ళొస్తే రీడింగ్ చూపించమని. పక్కింటాయన ప్రతిరాత్రీ రెండు పెగ్గులు తాగిగాని పడుకోడని రామనాథానికి తెలుసు.

వెంటనే ఇంటికి వెళ్ళి భార్యనడిగి పక్కింటి వాళ్ళ తాళం చెవి తీసుకున్నాడు. తలుపు తెరిచి లోపలికెళ్ళి చూస్తే అతడు ఆశించినట్లుగానే, అల్మైరాలో ఓ బాటిల్ కనిపించింది. దాన్ని తీసుకుని రాత్రి పార్టీ ఇచ్చే చోటుకి చేరుకున్నాడు రామనాథం.

మర్నాడు ఉదయం అలాంటి బాటిల్ కొని, పక్కింట్లో యథాస్థానంలో ఉంచాలనుకున్నాడు. ఖాళీ బాటిల్ను తీసుకుని తమ ఇంటివద్దవున్న వైన్ షాపుకి వెళ్ళి దాన్ని చూపించి అలాంటిది ఒకటి ఇమ్మని అడిగాడు.

"మా దగ్గర ఆ బ్రాండ్ లేదుసార్, రాష్ట్రపతి రోడ్ లోని పెద్ద షాపులో అది దొరకవచ్చు" షాపు ఎడ్రసు చెప్పాడు వాడు.

రామనాథం ఆ షాపుకి వెళ్ళి బాటిల్ని చూపించాడు.

"వుంది సార్, ఐదు వేల రూపాయలు " చెప్పాడు షాపు యజమాని.

"ఐదు వేలే..!?"

"అవును సార్! అది స్కాచ్ విస్కీ.." అన్నాడు.

నిజానికి రామనాథం ఐదారు వందలు ఖరీదుచేసే బాటిల్ తీసుకువెళ్ళాలనుకున్నాడు. చేసేది లేక ఐదువేల రూపాయలిచ్చి అలాంటి బాటిల్ ఒకటి కొని తీసుకెళ్ళి దాన్ని పక్కింట్లో యథాస్థానంలో వుంచాడు.

పక్కింటివాళ్ళు వచ్చారు. రామనాథం పక్కింటాయనతో మాట్లాడుతూ మధ్యలో ఆయనకి లిక్కర్ మీదనున్న అభిరుచిని అభినందిస్తూ చెప్పాడు.

"ఐదు వేలు ఖరీదు చేసే బాటిల్‌ని మీరు వారంలో పూర్తి చేస్తున్నారు.."

దానికాయన నవ్వి ఇలా చెప్పాడు

"పొరబాటు..నేను తాగేది ఐదువందల రూపాయల బాటిల్ విస్కీనే!"

"అదేమిటీ? ఈ ఫారిన్ ఇంపోర్టెడ్ విస్కీ ఖరీదు ఐదు వేలు కదా!"

"అదా! ఖాళీ బాటిల్ ఓ ఫ్రెండ్ దగ్గర తెచ్చాన్లెండి. నేను కొనే బాటిల్లోని విస్కీని షో కోసం వుంచిన ఈ బాటిల్‌లోకి వంపుకుంటాను.." చెప్పాడు పక్కింటాయన.!!

***

## డాక్టర్..డాక్టర్..! యర్రంశెట్టి శాయి



ఓ పేషెంట్ డాక్టర్ దగ్గరకు వెళ్ళి మందు తీసుకున్నాడు మామూలు ప్రకారం.

"చూడు డాక్టర్! మనిద్దరికీ మధ్య ఎంతో కొంత స్నేహం కూడా ఉంది కాబట్టి - నీకు డబ్బివ్వడం నాకు అంతగా నచ్చడం లేదు. అందుకే నేను నా విల్లులో నీకూ భాగం ఉండేట్లు రాశాను..." అన్నాడు పేషెంట్. డాక్టర్ పేషెంట్ భుజం ఆప్యాయంగా తట్టాడు.

"నీదింత గొప్ప మనసని నాకు తెలుసు! అది సరే - నీకిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఓ సారిటివ్వు..కొంచెం మార్పు చెయ్యాల్సి ఉంది.."

***

"మా మావయ్య గత సంవత్సరంగా పిచ్చి పట్టినట్లు ప్రవర్తిసున్నాడండీ.." సైకాలజిస్ట్ దగ్గరకొచ్చి చెప్పాడు శంకర్రావు.

"ఏం చేస్తున్నాడు?"

"పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ కుర్చీలో కూర్చుని చేతుల్లో స్టీరింగ్ వున్నట్లు వూహించుకుని కారు నడుపుతున్నట్లు ప్రవర్తిస్తున్నాడండీ"

"అది కారు కాదనీ..కుర్చీ అనీ నువ్వు చెప్పలేదూ..?"

"ఎలా చెప్తానండీ! సాయంత్రం కారు కడిగినందుకు నాకు రోజుకి పాతిక రూపాయలిస్తుంటేనూ!"

"మరిప్పుడెందుకు ఇక్కడికొచ్చినట్లు..?"

"ఇప్పుడు కారు తనే కడుక్కుంటున్నాడండీ.."

***

ఆరో అంతస్తులో ఉంటున్న ఒకావిడ రెండో అంతస్తులో వుంటున్న సైకియాట్రిస్ట్ దగ్గరకొచ్చింది.

"మా ఆయన వారం రోజుల్నుంచీ తను 'లిఫ్ట్' ననుకుంటున్నాడండీ!" అంది ఆందోళనగా.

"మరి నా దగ్గరకు తీసుకురాకపోయారా?" అడిగాడు డాక్టర్.

"ఊహుఁ..కుదరదండీ ఆయన రెండో అంతస్తు దగ్గర ఆగరు.."

***

ఇద్దరు డాక్టర్లు క్లబ్‌లో కలుసుకున్నారు.

"ఆ కోటీశ్వరుడికి నువ్వే పరేషన్ చేశావట గదా?"

"అవును! కరెక్టుగా టైముకి చేసేశాను. లేకపోతే ఆపరేషన్ అవసరం లేకుండానే కోలుకునేవాడు.."

***



డాక్టర్: భోజనం చేసాక ఈ మందు ఆరు చెంచాలు త్రాగండి!

లక్ష్మమ్మ: కానీ మా ఇంట్లో రెండు చెంచాలే ఉన్నాయండీ..

***

గవర్నమెంట్ హాస్పిటల్లో ఒక డి.ఎమ్.ఒ గారు ఓ డాక్టరు తయారు చేసిన మరణ ధృవ పత్రం చూసారు.

అందులో 'మరణమునకు కారణము' అని ఉన్నచోట డాక్టర్ సంతకం కనిపించింది. ఆయన వెంటనే సర్టిఫికెట్ డాక్టర్‌కి త్రిప్పి పంపిస్తూ ఒక నోట్ రాసారు..

"కారణం మీరే అయ్యుండవచ్చు గాని వైద్యశాస్త్రానికి సంబంధించిన చిన్న కారణం కూడా ఏదైనా రాస్తే బావుంటుంది.?!"

***

డాక్టర్: ఏవండీ..అవధాన్లుగారూ! ఈ మధ్య కనిపించడమే లేదు..

అవధాన్లు: పెద్ద జబ్బు చేసిందండీ! అందుకే రావటం కుదరలేదు..

***

చల్లపల్లి రాజా గారు ఆరోగ్య శాఖా మంత్రిగానూ. ఎమ్.ఆర్.అప్పారావు గారు ప్రొహిబిషన్ మంత్రిగానూ ఉన్న రోజులవి. అప్పారావు గారికి బాగా జలుబు చేసి ఉన్నప్పుడు ఆయనింటికి చల్లపల్లి రాజాగారు వచ్చారు.

"రండి!రండి.! అప్పారావు గారికి జలుబు చేసింది. మీ డిపార్ట్‌మెంట్‌కి రావాలని ఆలోచిస్తున్నారు.." అన్నారు యన పక్కనున్నాయన.

"కానీ మాకే జలుబు చేస్తే మేమే వారి డిపార్ట్‌మెంట్‌కి వెళుతున్నాం.." అన్నారు రాజాగారు తనకు అలవాటైన 'మందు' ని తలుచుకుంటూ..

***

టెలిగ్రాఫీని కనుక్కున్న శామ్యూల్ ఎఫ్.బి. మోర్స్ అంతకుముందు పెయింటింగ్స్ వేస్తుండేవాడు.

ఓ సారి మరణశయ్యపై బాధపడుతున్న ఓ రోగిని చిత్రీకరించి తన స్నేహితుడైన ఓ డాక్టర్కి చూపించాడు.

"నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగాడు ఆతృతగా.

డాక్టర్ కళ్ళజోడు పెట్టుకొని పరీక్షించి "మలేరియా" అన్నాడు తేల్చిపారేస్తూ.

# చౌ చౌ

రైలు బాగా రద్దీగా వుంది..చాలామంది ఆడవాళ్ళు సీట్లు ఖాళీలేక నిలుచుని ఉన్నారు. ఒకా లావు పాటావిడ తన పక్కన ఉన్న మగ వ్యక్తిని వంకకోపంగా చూస్తూ .."నువ్వే కనుక పెద్దమనిషి వైతే లేచి నిలబడవయ్యా..నిలుచున్న అమ్మాయిల్లో ఎవరో ఒకరు కూర్చుంటారు.." అంది.

"నీకే కనుక జాలి లాంటిదుంటే నువ్వు లేచి నిలోచమ్మా..ఏకంగా ముగ్గురు ఆడవాళ్ళు కూర్చోగలరు.." రిపార్టీఇచ్చాడా పెద్దమనిషి.

***

"ఒరే బుడుగూ.. యాభై రూపాయలకి ఇరవై యాపిల్స్ వస్తే ఒక్కో యాపిల్ ఖరీదెంతో చెప్పగలవా?" మాస్టారి ప్రశ్న.

"భలే వారు మాస్టారూ..ఈ రోజుల్లో యాభైరూపాయలకి ఇరవై యాపిల్స్ ఎక్కడ వస్తాయి సార్..? ఎవడన్నా అలా ఇచ్చినా అవన్నీ ఏ కుళ్ళిపోయినవో, పుచ్చినవో ఐవుంటాయి.."

***

స్కూళ్ళ ఇన్స్పెక్టర్ ఒక స్కూల్లో పిల్లలని పరీక్షచేస్తున్నారు...

"పిల్లలూ..మీకు తోచిన నంబరు ఒకటి చెప్పండి.." అన్నాడాయన.

"95.." చెప్పాడో కుర్రాడు..

ఇన్స్పెక్టర్ గారు బోర్డు మీద 59 అని రాసారు..

"ఇంకో నెంబరు చెప్పండి.."

"84 అరిచాడింకో కుర్రాడు.

ఈ సారి 48 అని బోర్డు మీద రాసాడాయన.

పిల్లలకి ఆయన ఏమి చెయ్యబోతున్నారో తెలీలేదు.

"ఇంకో నంబరేమైనా చెబుతారా?" మరో సారి అడిగాడాయన.

"66" చివరి బెంచీలోంచి అరిచాడొకతను.. "ఇప్పుడు చూద్దామా..దీన్ని ఎలా తిరగేసి రాస్తాడో.." పక్కనున్న మిత్రుడితో నెమ్మదిగా అన్నాడు.



***

స్పర్శేంద్రియాల గురించి పిల్లలకు పాఠం చెబుతోంది టీచర్. వాళ్ళనుంచీ సమాధానాలు రాబట్టుకోడానికి ప్రశ్నలు అడగసాగారు ఆవిడ.

"మనకి కళ్ళు ఎందుకున్నాయి..?"

"చూడడానికి.."

"మరి ముక్కు దేనికి..?"

"వాసన చూడడానికి.."

"మరి చెవులు?"

"రింగులు పెట్టుకోడానికి.."

***

చలికాలంలో పక్షులన్నీ ఉత్తర దిక్కుగా వలసపోతున్నాయి. "పెద్ద పక్షి వెనకాలే ఎగురుతూ ఎప్పుడూ దానినే అనుసరించాలా మనం?" అడిగింది ఓ పిల్ల పక్షి.

"తప్పదు మరి గూగుల్ మాప్స్ ప్రింట్ దాని దగ్గరే ఉంది.." పక్కనున్న పక్షి అసలు రహస్యం చెప్పింది.

***

హైదరాబాదు జూలో కొత్తగా ఒక గుర్రాన్ని తెచ్చి ఉంచారు. ఎవరైనా గుర్రానికి చిరుతిళ్ళు పెడతారేమోనని అధికారులు ఒక బోర్డు పెట్టారు.."దయచేసి ఈ గుర్రానికి చిరుతిళ్ళు పెట్టవద్దు.. ఇట్లు - జూ యాజమాన్యం" అని.

మర్నాడు చూస్తే దానికింద మరో బోర్డు ఉంది.. "పై నున్న నోటీసుని ఎవరూ పట్టించుకోనవసరం లేదు..ఇట్లు - గుర్రము "

***



"అదేంటో డాక్టర్ గారూ..నేను గత నెల రోజులుగా స్నానం చేయడం లేదు. ఐనా నా ఒంటి నుంచీ అసలు చెడు వాసనే రావట్లేదు.." ఆశ్చర్యంగా అన్నాడు జంబులింగం.

"మూడు రోజులుపాటు ఈ మందు బిళ్ళలు వాడి మళ్ళీ రండి.." అన్నాడు డాక్టర్.

అలానే బిళ్ళల వాడకం అయ్యాక వచ్చాడు జంబులింగం..

"డాక్టర్..మీరిచ్చినవి ఏం మందులో ఏమో, అవి వాడ్డం మొదలెట్టాక నా ఒళ్ళు నాకే భరించలేనంత దుర్వాసన వస్తోంది.." అని ఫిర్యాదు చేసాడు.

"అయితే మీ ముక్కు పనిచేస్తోందన్న మాట.." నెమ్మదిగా అన్నాడు డాక్టర్.

***

"చదవగానే నెత్తిమీద వెంట్రుకలు నిక్క బొడుచుకునే అద్భుతమైన సస్పెన్స్ నవల ఉంది నా దగ్గర" అన్నాడు విశ్వేశ్వర్.

"లాభం లేదు సార్, మా ఎడిటర్ గారిది బట్టతల.." చెప్పాడు సబ్-ఎడిటర్,

***